సాక్షి
నిర్మల్
మంగళవారం । 7 । నవంబర్ । 2023



దెబ్బతింటున్న పంటలు

IIIలో

రైతులకు కష్టాలు తప్పడం లేదు. నెలరోజులకు పైగా వర్షాలు లేకపోవడంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. ఏం చేయాలో తోచక అన్నదాతలు అల్లాడుతున్నారు.

నేడు బాలల సైన్స్ కాంగ్రెస్

నిర్మల్ రూరల్: జిల్లాస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమం మంగళవారం జిల్లా కేంద్రంలోని వాసవి వరల్డ్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో.. ఆరోగ్యం శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం అనే ప్రధాన అంశంపై విద్యార్థులు ప్రాజెక్టులు చేయాల్సి ఉంటుందన్నారు. 6 నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు పాల్గొనాలని పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2 /22.4

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశంలో అక్కడక్కడ మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

నాలుగోరోజు రెండు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో సోమవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. నిర్మల్ నియోజకవర్గ పరిధిలో సోమవారం ఒకే ఒక నామినేషన్ దాఖలయింది. కాంగ్రెస్ నియోజకవర్గ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు తన కూతురుతో కలిసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి రత్న కళ్యాణికి అందజేశారు.

నామినేషన్ వేసిన బీజేపీ అభ్యర్థి



నామినేషన్ వేస్తున్న రామారావ్‌పటేల్

ముధోల్: ముధోల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పవార్ రామరావ్‌పటేల్ సోమవారం నామినేషన్ దాఖాలు చేశారు. రెండు సెట్ల నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి కోమల్‌రెడ్డికి అందజేశారు. ఆయన వెంట ముత్యంరెడ్డి, పోతన్న, రమేశ్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్ బాబు ఉన్నారు.

భైంసా ఏఎంసీలో వారం రోజులు బీట్ బంద్

భైంసాటౌన్: భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో వారంరోజులపాటు భూసార్ బీట్ పంట ఉత్పత్తుల కొనుగోళ్లు) నిలిపేయనున్నట్లు ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి అడెల్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి పండుగ నేపథ్యంలో దుకాణాలు శుభ్రం చేసుకునేందుకుగాను బీట్ బంద్ ఉంచాలని కమీషన్ ఏజెంట్లు చేసిన విన్నపం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు బీట్ బంద్ ఉంటుందని తెలిపారు. 15వ తేదీ బుధవారం నుంచి కొనుగోళ్లు పునఃప్రారంభిస్తామని తెలిపారు.

వెడ్మ బొజ్జుకు ఆర్థిక సాయం



బొజ్జుకు చెక్కు అందిస్తున్న పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జుకి సారంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ తరఫున డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో రూ.1.25 లక్షలు అందించారు. శ్రీహరిరావు సమక్షంలో సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఈ మొత్తం బొజ్జుకు అందించారు.

'బీసీ జనగర్జన సభ విజయవంతం చేయాలి'

భైంసాటౌన్: సికింద్రాబాద్‌లో మంగళవారం నిర్వహించే బీజేపీ బీసీ జనగర్జన సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దడిగె భోజన్న కోరారు. భైంసాలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే సభకు ప్రధాని మోదీ హాజరవుతారని తెలిపారు. ముధోల్ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో బీసీలు తరలి రావాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావుల పోశెట్టి, నాగనాథ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, లోకేశ్వరం మండల నాయకులు గోపి, సాయన్న, భాస్కర్, సంజు, సంతోష్ పటేల్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

11న మాదిగల విశ్వరూపసభ




కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కోసం ఈనెల 11న నిర్వహించతలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభ తలపెట్టినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కమలాకర్, ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో మహాసభ కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే సభను జయప్రదం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాటం జరుగుతుందన్నారు. విద్య, ఉద్యోగ, సాంఘిక రాజకీయాల్లో మాదిగల వాటా మాదిగలకు ఉపకులాల్లో రావాల్సి ఉన్నా, వర్గీకరణ లేక తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తరి గంగాధర్, జన్నారపు శంకర్, ప్రవీణ్, శంకర్, భూమన్న, నూతన్, రాకేశ్, మహేందర్, చరణ్, శశి పాల్గొన్నారు.

ఏ ఓటు.. ఎటో?

- ఆరా తీస్తున్న పార్టీలు
- లెక్కలేస్తున్న అభ్యర్థులు
- వర్గాల వారీగా అంచనాలు
- పరిస్థితిని బట్టి తాయిలాలు



నిర్మల్: 'హలో రామన్న.. నమస్తేనే. మంచిగున్నవాయే. ఎట్లున్నది మనూళ్లె. అంత మనదిక్కే ఉన్నరు కదనే. ఇంతకు మన కులపోళ్లు ఎంతమంది ఉంటరే. ఊళ్లె ఏయే కులపోళ్లు ఎంతమంది ఉంటరే రామన్న. అందులో ఓళ్లు ఏమంటున్నరో కూడా.. జర అరుసుకోయే' అంటూ గ్రామాలు, వార్డుల్లో ఉంటే క్రియాశీలక కార్యకర్తలు, నాయకులకు అభ్యర్థుల అనుచరుల నుంచి ఫోన్లు వస్తున్నాయి. ఈమేరకు గ్రామాల్లో సదరు నాయకులు కులాలు, సంఘాల వారీగా లెక్కలు తీసి, అందులో ఎవరు ఎటు మాట్లాడుతున్నారు.. ఏ పార్టీ దిక్కు తిరుగుతున్నారు.. అనే విషయాల నుంచి అన్ని వివరాలు సేకరించి తిరిగి వారికి చెబుతున్నారు. ఇలా వచ్చిన లెక్కల ప్రకారం అభ్యర్థులు ఓట్లు రాబట్టుకునేందుకు ఏం చేయాలో అంచనాలు వేసుకుంటున్నారు. ఎవరికి తాయిలాలు పంపిణీ చేయాలి, ఎప్పటి నుంచి ఇవ్వాలి, ఎవరితో పంపించాలనే లెక్కలూ వేస్తున్నారు.

ఏ కులమెటు..

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ఓటర్ల జాబితాలను జల్లెడ పడుతున్నారు. ఇందులో తమ పరిధిలో ఏ కులం వారు ఎంతమంది ఓటర్లు ఉన్నారనే లెక్కలూ తీస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధాన కులాలు కొన్ని వన్‌సైడ్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరు ఎవరికి ఓటు వేస్తారనే దానిపై చర్చ నడుస్తోంది. రాష్ట్రస్థాయిలో తమ కులం వాళ్లు ఎక్కువగా ఏ పార్టీలో ఉంటే స్థానికంగా దాదాపు ఆ కులం ఓటర్లు అదే పార్టీ వైపు మొగ్గుచూపుతున్నారు. ఇటీవల కొన్ని కులాలు ఈ మేరకు తీర్మానాలు చేసుకున్నాయి. తమ నేతలు ఉన్న పార్టీనే గెలిపించుకోవాలనుకుంటున్నాయి.

ప్రభావిత ఓట్లు..

జిల్లాలో కొన్ని కులాలు, వర్గాల ఓట్లు చాలా కీలకంగా మారుతాయి. అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తాయి. జిల్లా జనాభా, ఓటరు జాబితాలో మున్నూరుకాపు, పద్మశాలి, ముదిరాజ్, విశ్వబ్రాహ్మణ, బెస్త, మాల, మాదిగ, యాదవ, కురమ, రజక, నాయీబ్రాహ్మణ, నాయక్‌పోడ్, లంబాడా, ఆదివాసీ, ఆరె మరాఠా, రెడ్డి, వెలమ, వైశ్య, బ్రాహ్మణ తదితర కులాలు ఓ మోస్తరు నుంచి అధికసంఖ్యలో ఉన్నాయి. ఇందులో మున్నూరుకాపు, పద్మశాలి, ముదిరాజ్, మాల, మాదిగ, బెస్త ఓటర్ల సంఖ్య అత్యధికంగా ఉన్న గ్రామాలు చాలాఉన్నాయి. ఆయా గ్రామాల్లో సదరు కులాల ఓట్లే కీలకం. జిల్లాకేంద్రంలో కొన్ని గల్లీలకు గల్లీలే మున్నూరుకాపులకు సంబంధించినవి, మరికొన్ని పద్మశాలీలకు సంబంధించినవి ఉన్నాయి. ఇలా కొన్ని గ్రామాల్లోనూ రెండుమూడు కులాలు అధిక సంఖ్యలో ఉన్నవి ఉన్నాయి.

ఎవరినెలా..

'మీ ఊళ్లె ఫలానా కులపోళ్లు ఎటుదిక్కున్నరే. వాళ్ల కులంలో ఓళ్లు పెద్దమనుషులే..'అన్న ఆరాలనూ పార్టీల నేతలు తీస్తున్నారు. ఎన్నికల వేళ సదరు కులాల ఓట్లను గంపగుత్తగా తమవైపు తిప్పుకోవాలంటే ఏం చేయాలనే వ్యూహాలు రచిస్తున్నారు. ఇప్పటికే ఒకట్రెండు దఫాలుగా దావత్‌లు ఇచ్చేశారు. సంఘాల వారీగా కులాలను కోఆర్డినేట్ చేసుకుంటూ వస్తున్నారు. వారికి కావాల్సిన పనులు తెలుసుకుంటున్నారు. వాటితోపాటు ఎన్నికల వేళ తాయిలాలను ఇచ్చేందుకూ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా ఒక్క ఓటు కూడా పక్కపార్టీకి పోవద్దు.. అన్న తరహాలో పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నారు.

మైనార్టీలు కీలకం..

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ముస్లిం, క్రైస్తవ ఓటర్లు ఉన్నారు. ఇందులో క్రైస్తవులు కాస్త తక్కువగా ఉన్నప్పటికీ ముస్లింలు మాత్రం గణనీయంగా ఉన్నారు. నిర్మల్, ముధోల్ రెండు నియోజకవర్గాల్లో మైనార్టీల ఓట్లే కీలకం. వీరి ఓట్లే అభ్యర్థుల గెలుపోటములను డిసైడ్ చేస్తుంటాయి. అందుకే చాలామంది అభ్యర్థులు వారి ఓట్లు ఎన్ని వస్తాయని అంచనా వేసుకున్న తర్వాతే ఇతర ఓట్లను లెక్కించుకుంటారు. ఖానాపూర్‌లోనూ ఈసారి మైనార్టీలు కీలకంగా మారనున్నారు. జిల్లాలో 30–40 శాతం ఉండే మైనార్టీ ఓట్లు చాలావరకు వన్‌సైడ్ పడతాయన్న నమ్మకం అభ్యర్థుల్లో ఉంటోంది. ఈమేరకు వారిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

సమస్యలు అనేకం.. పరిష్కారం శూన్యం



గుంతలమయంగా దుమ్ముతో ఉన్న ఖానాపూర్ రోడ్డు విస్తరణ పనులు



కడెం నదిపై కొట్టుకుపోయిన వంతెన

- కలగానే వంతెనల నిర్మాణం
- శిథిలావస్థల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- సీసీరోడ్లు, డ్రైనేజీలు లేక పట్టణ ప్రజల తిప్పలు
- నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు

ఖానాపూర్: అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజులు మాత్రమే సమయం ఉండడంతో అభ్యర్థులు కొత్త కొత్త హామీలతో ప్రజలను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఖానాపూర్ పట్టణంతోపాటు మండలాల్లో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఖానాపూర్, పెంబి మండలాల్లోని మారుమూల గిరిజన గ్రామాల్లోని సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు. నియోజకవర్గంలోనే ఐటీడీఏ ఉన్నా తమను పట్టించుకునే వారు కరువయ్యారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగులపై వంతెనల నిర్మాణానికి నోచుకోవడం లేదని, తండాలకు రోడ్లు వేయడం లేదని పేర్కొంటున్నారు.

నాట్లు వేసి నిరసనలు..

మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న ఖానాపూర్ పట్టణంగా మారినా పనులు మాత్రం అప్‌గ్రేడ్ కావడంలేదు. పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు రెండేళ్లయినా ముందుకు సాగడం లేదు. దీంతో గతుకుల రోడ్లతో అత్యవసర పరిస్థితిలో ప్రజలు పొలిమేర దాటాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రతిపక్షాలు నాట్లు వేసి పలురకాల నిరసనలు తెలిపినా అదేపరిస్థితి.

శిథిలావస్థలో భవనాలు..

ఖానాపూర్, పెంబి మండలాల్లో ప్రభుత్వ భవనాల శిథిలావస్థకు చేరాయి. పెంబి మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ఖానాపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం భవనం శిథిలావస్థలో ఉన్నా పట్టించుకోవడం లేదు. పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, బ్యాంకుల భవనాలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ భవనాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి.

ఉన్నత విద్యకు దూరంగా...

నియోజకవర్గ కేంద్రమైన పట్టణంలో ప్రభుత్వ డిగ్రీకళాశాల లేక ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ప్రతీసారి ఎన్నికల్లో నేతలు హామీలు ఇవ్వడం తదనంతరం మంత్రులు, ముఖ్యమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను కలిసిన ఎన్నిసార్లు విన్నవించినా డిగ్రీ కళాశాలకు నోచుకోలేకపోతుంది.

కుర్చీవేశాం.. కేసీఆర్ ఎక్కడ..

కలగానే వంతెనల నిర్మాణం..

పెంబి మండలం యాపల్‌గూడ, గుమ్మెన తోపాటు ఖానాపూర్ మండలం కొలాంగూడ పంచాయతీ పరిధిలోని కుసుంపూర్ తదితర గ్రామాల్లోకి వెళ్లేందుకు వంతెనలు లేక ప్రజల ఇబ్బంది పడుతున్నారు. వానా కాలంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండడం లేదు. పెంబి మండలం పస్పుల, ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ వద్ద కడెం నదిపై నిర్మిస్తున్న గంగాపూర్ బ్రిడ్జి రెండేళ్ల క్రితం కొట్టుకుపోయాయి. ఇప్పటికీ వంతెన నిర్మాణం చేపట్టలేదు. తాత్కాలిక వంతెనలు కూడా నిర్మించలేదు.

గత సార్వత్రిక ఎన్నికల్లో ఖానాపూర్ పట్టణంలో నిర్వహించిన ఎన్నికల సభలో మామడ మండలం పొన్కల్‌లోని సదర్మాట్ నుంచి ఖానాపూర్ మండలం వరకు 7 కిలోమీటర్ల మేర ప్రత్యేక కాలువ ఏర్పాటు చేస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర స్థాయి అధికారులతో వచ్చి తానే ఇక్కడ కుర్చీవేసుకుని పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ ఆ హామీ నెరవేరలేదు. ప్రతిపక్ష పార్టీల తోపాటు రైతులు ఆందోళనలు, నిలదీతలు, నిరసనలు చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు కుర్చీవేశాం.. కేసీఆర్ ఎక్కడ అంటూ నిరసనలు తెలిపారు.

వాగుపై వంతెన నిర్మించాలి



ఉమ్మడి ఎర్వచింతల్ పంచాయతీ పరిధిలోని కుసుంపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన లేక పలువురు బల్లివాగులో పడికొట్టుకుపోయారు. ప్రతీసారి ఎన్నికల్లో హామీలు ఇవ్వడం పరిపాటిగా మారింది. ప్రభుత్వాలు మారినా పాలకులు మారిన సమస్యలు పరిష్కారం కావడం లేదు.

– సుతారి రాజేశ్వర్, ఎర్వచింతల్

దశాబ్దాలుగా సమస్య..



పెంబి మండలంలోని పస్పుల, యాపల్‌గూడ, గుమ్మెన ప్రాంతాల్లో వంతెనలు లేక సుమారు 30 గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో వాగులు దాటుతూ కొట్టుకుపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. వాగులు దాటే దారిలేక ఎంతో మంది గర్భిణులు రోడ్లపైనే ప్రసవించారు. కనీసం రవాణా సౌకర్యం కల్పించలేని పాలకులు ఉన్నారు.

– మల్లెపల్లి స్వామి, పెంబి

ఉన్నత విద్య దూరం..



పేరుకే నియోజకవర్గ కేంద్రమైనా ఖానా పూర్ పట్టణంలో ప్ర భుత్వ డిగ్రీకళాశాల లేదు. గతంలో సీఎంలు, మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎన్నోసార్లు విన్నవించాం. సంతకాల సేకరణ, ఆందోళన కార్యక్రమాలు చేపట్టాం. దీంతో ఇక్కడి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. కొత్త ప్రభుత్వం అయినా కళాశాల మంజూరు చేయాలి. – సునారికారి రాజేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

ఎన్నికల విధుల్లో అలసత్వం వహించొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల సిబ్బంది అందరూ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం వహించొద్దని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. పీవోలు, ఏపీవోలకు కలెక్టరేట్ సమావేశమందిరంలో మాస్టర్ ట్రైనర్ సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ ఎన్నికల విధులకు సంబంధించి వివిధ స్థాయిలలో నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించారు. రాబోయే 25 రోజులు అత్యంత కీలకమన్నారు. అనంతరం ఈవీఎంల పనితీరుపై హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ పొందుటకు గ్రూపుల వారీగా ఈవీఎంల పనితీరు స్వయంగా పరిశీలించి నేర్చుకునే అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అనంతరం నోడల్ అధికారి డాక్టర్ ఏ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని సందేహాలను నివృత్తి చేసుకుని విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లు లక్ష్మణ్, బచ్చు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, జొన్నల రవీందర్ అవగాహన కల్పించారు.

ఈవీఎం గోదాములు పరిశీలన..

జిల్లా సమీకృత కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

శుభ్రత పాటించాలి..

సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో ఆహార తయారీలో శుచి, శుభ్రత పాటించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. క్యాంటీన్‌ను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో మాట్లాడారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైతును రాజును చేసిన ప్రభుత్వం

- మంత్రి, బీఆర్ఎస్ నిర్మల్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి



కనకాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి ఐకేరెడ్డి

లక్ష్మణచాంద: రైతును రాజును చేసిన ఘనత సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని మంత్రి, బీఆర్ఎస్ నిర్మల్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట కనకాపూర్ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఇప్పటి వరకు 9 మంది రైతులు మృతి చెందితే ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున అందించామని తెలిపారు. గ్రామంలోని దుర్గామాత ఆలయాన్ని రూ.28 లక్షలతో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కనకాపూర్ వాగుపై వంతెన నిర్మాణం, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత వడ్యాల్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ అధికారి సల్ల రాజేంద్రప్రసాద్ తన నెల పింఛన్ రూ.30,931 ఐకేరెడ్డికి విరాళంగా అందించారు. ధర్మారం మహా పోచమ్మ ఆలయ అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.1.40 లక్షలు కేటాయించినట్లు తెలి పారు. అనంతరం మండలంలోని రాచాపూర్, పీచర, మునిపెల్లి, మల్లాపూర్, మాచాపూర్, పార్‌పెల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేష్, మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

లోటస్ ట్యాంక్..





నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారిని అనుకుని ఉన్న కడెం మండలం కన్నాపూర్ గ్రామ చెరువు అందమైన తామర పూలతో ఆహ్లాదం పంచుతోంది. రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు కాసేపు చెరువు వద్ద ఆగి ఫొటోలు దిగి వెళ్తున్నారు. పూజలు కోసుకెళ్తున్నారు.

– (కడెం)

ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశం



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

నిర్మల్ రూరల్: ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీలలో భాగంగా జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాల నుంచి వెళ్లిన 9 మంది ఉపాధ్యాయులకు పాఠశాలలో సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జిల్లా పరీక్షల సహాయ అధికారి, ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ.. 12 ఏళ్లుగా పాఠశాలలో ఎన్నో వినూత్న కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల సేవలను అభినందించారు. గతంలో విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంలో ఉపాధ్యాయుల కృషిని గుర్తు చేశారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గోవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ మొదలైంది. అయితే కార్యాలయం వద్ద మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయకపోవడంతో మీడియా ప్రతినిధులు, కెమెరామెన్లు, ఫొటోగ్రాఫర్లు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కనీసం కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు కూడా లేదు. దీంతో ఇలా చెట్లకింద, అక్కడికి వచ్చిన వాహనాలపై కూర్చుంటున్నారు. డీపీఆర్‌వో తీరుపై సోమవారం మీడియా ప్రతినిధులు రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

క్లుప్తంగా

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ ఆశ్రమ క్రీడా పాఠశాలలో మంగళవారం ఉమ్మడి జిల్లా బాలుర సబ్ జూనియర్ అండర్-14 ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.శ్రీధర్‌రెడ్డి, జి.ఈశ్వర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, బోనాఫైడ్ సర్టిఫికెట్లతో పాఠశాల కోచ్ శివకుమార్ వద్ద రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 15, 16, 17 తేదీల్లో మెదక్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 9398430685, 9573866008, 9440064422 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతం వద్ద రేషన్ బియ్యాన్ని సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మండల కేంద్రం నుంచి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు బొలెరో వాహనంలో షేక్ జావిద్ అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పది మందిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన పది మందిపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ప్రదీప్ కుమార్ తెలిపారు. పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలో గల వివిధ షాపుల యజమానులు అర్ధరాత్రి వరకు దుకాణాలు తెరిచి ఉంచుతున్నారని పేర్కొన్నారు. రాత్రి 10 గంటల తర్వాత షాపులు తెరిచి ఉంచిన యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.

భార్యను వేధించిన భర్తకు జైలు

ఖానాపూర్: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు 7 నెలల సాధారణ జైలుశిక్ష తోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ సోమవారం తీర్పుచెప్పారు. ఖానాపూర్ ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్‌కు చెందిన ఆడె పుష్పలత (35)కు ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన ఆడెపు వేణుగోపాల్‌తో 2009లో వివాహమైంది. వీరి కాపురం సజావుగా సాగింది. కొన్నినెలల తర్వాత రూ.5 లక్షల అదనపు కట్నం తేవాలని, మానసికంగా, శారీరకంగా భార్యను వేధించసాగాడు. వేధింపులు తీవ్రం కావడంతో భార్య 2012లో అప్పటి ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై రాము కేసు నమోదు చేశారు. ఏపీపీవో రామకృష్ణ కోర్టులో 9 మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి తీర్పునిచ్చారని ఎస్సై వివరించారు.

'ప్రజాఆశీర్వాద సభ' విజయవంతం చేయాలి

మందమర్రిరూరల్: మందమర్రిలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో మంగళవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సంపత్, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓట్లే.. సీట్లు లేవు!

- కార్మికవర్గానికి ఏ పార్టీలో దక్కని టికెట్లు
- సింగరేణి నేతలకు మొండిచెయ్యి
- ఈసారి టికెట్ ఆశించినవారికి భంగపాటే
- 12 నియోజకవర్గాల్లో సింగరేణి ఓట్లు కీలకం
- గెలుపోటములను నిర్ధారించేది ఈ ఓటర్లే

జంగ్ తెలంగాణ



శ్రీరాంపూర్: రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశ్రమ సింగరేణి. ఆరు జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సింగరేణి విస్తరించి ఉంది. 43 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు, 28 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఈ సంస్థలో పనిచేస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సింగరేణి అంతటా కలిపి సుమారు 3.5 లక్షల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. ఈ ప్రాంతంలో పోటీచేసే అభ్యర్థుల గెలుపోటములు డిసైడ్ చేసేది సింగరేణి ఓటర్లే. దీంతో ప్రధానపార్టీలు ప్రతిసారి వారి ఓట్ల కోసమే వెంపర్లాడుతాయి. కాని కార్మికవర్గానికి సీట్లు ఇవ్వడంలో మొండిచెయ్యి చూపెడుతున్నాయి. ఈసారి ఎన్నికల్లో ఒక్క టికెట్ కేటాయించలేదు. దీనిపై సింగరేణిలో తీవ్ర చర్చ జరుగుతోంది. కార్మికవర్గం అసెంబ్లీ గడప తొక్కేదెప్పుడు, తమ గళం వినిపించేదెప్పుడని ప్రశ్నిస్తున్నారు.

జిల్లాల పరిధిలో..

మంచిర్యాల, కుమురం భీం, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో సింగరేణి విస్తరించి ఉంది. ఈ జిల్లాల పరిధిలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, రామగుండం, మంథని, పెద్దపల్లి, భూపాలపల్లి, కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్ల ందు, పినపాక అసెంబ్లీ సెగ్మెంట్లలో సింగరేణి ఓటర్లు కీలకంగా ఉన్నారు. ఇక్కడ పార్టీ అభ్యర్థి గెలవాలంటే కార్మికుల ఓట్లు తప్పనిసరి. దీంతో అన్నిపార్టీలు సింగరేణిలో వారి అనుబంధ కార్మిక సంఘాల మద్దతుతోనే సింగరేణి ఓట్లు వేయించుకోవడం పరిపాటి.

కార్మికవర్గానికి ప్రాధాన్యత ఏది?

రాష్ట్ర సాధనలో సకలజనుల సమ్మె చేసిన చరిత్ర సింగరేణి కార్మికులది. ఇంతటి ఉద్యమ స్ఫూర్తి, ఎన్నో త్యాగాలు చేసి స్వరాష్ట్రాన్ని సాధించిన కూడా సింగరేణి గళం అసెంబ్లీలో వినిపించడం లేదు. ఇటీవల అన్నిపార్టీలు ప్రకటించిన అభ్యర్థుల్లో ఎక్కడ కూడా కార్మికవర్గానికి ప్రాధాన్యత కల్పించలేదు. ప్రస్తుత టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావుకు అధికార బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చిన అధిష్టానం అది నెరవేర్చలేదని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. 2014 ఎన్నికల్లో కార్మికవర్గం నుంచి శ్రీరాంపూర్‌కు చెందిన టీబీజీకేఎస్ నాయకుడు పెట్టం లక్ష్మణ్‌కు టికెట్ ఇవ్వడానికి బీఆర్‌ఎస్ నిర్ణయించి చివరి నిమిషంలో మొండి చెయ్యి చూపింది.

వారికి మొండిచెయ్యి..

ప్రధాన పార్టీల నేతలు సింగరేణిని పట్టించుకోకున్నా చివరికి ఒకరిద్దరు నేతలు వారి మాతృపార్టీల టికెట్లు ఆశించారు. వారికి కూడా మొండిచెయ్యి మిగిలింది. రామగుండం నుంచి టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య టికెట్ కావాలని బీఆర్‌ఎస్ అధిష్టానానికి మొర పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఇక్కడ సిట్టింగ్ చందర్‌కే ఇచ్చారు. ఇదే నియోజవర్గంలో కాంగ్రెస్ నుంచి ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ టికెట్ ఆశించిన నిరాశే ఎదురైంది. ఇక కమ్యూనిస్టు పార్టీలది కూడా అదే తీరుగా ఉంది. బెల్లంపల్లి నుంచి రేగుంట చంద్రశేఖర్ అనే సింగరేణి మాజీ ఉద్యోగి సీపీఐ నుంచి టికెట్ ఆశించాడు. పొత్తుల భాగంగా ఇది కాంగ్రెస్‌కు పోయింది. చివరికి చెన్నూర్ ఇస్తారనుకుంటే అక్కడ కూడా వివేక్ రావడంతో నిరాశే మిగిలింది.

సమైక్యాంధ్రలోనే గుర్తింపు

సమైక్యాంధ్రలోనే సింగరేణి కార్మికవర్గానికి గుర్తింపు ఉంది. 2009 కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి.. అప్పటి ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రస్తుత టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావుకు ఎమ్మెల్సీగా గుర్తింపునిచ్చారు. అంతకుముందు ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేడారం నుంచి సింగరేణి ఉద్యోగి మాలెం మల్లేశ్‌కు టీడీపీ టికెట్ ఇచ్చి గెలిపించింది. తర్వాత 2004 ఉద్యమ సమయంలో కేసీఆర్ సింగరేణి ఉద్యోగి అయిన కొప్పుల ఈశ్వర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో ఆయన గెలిచారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో బెల్లంపల్లి నుంచి సింగరేణి ఉద్యోగి రాజేశ్వర్ రావు భార్య అమురాజుల శ్రీదేవి, చెన్నూర్ నుంచి బోడ జనార్దన్ టీడీపీ తరుపున గెలిచారు. ఈసారి శ్రీదేవి బెల్లంపల్లి బీజేపీ నుంచి బరిలో నిలిచారు.

పాదరక్షలు లేకుండానే నామినేషన్



నామినేషన్ వేయడానికి వెళ్తున్న అనిల్‌జాదవ్, ఆయన భార్య హరిప్రియ

ఇచ్చోడ: బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ సోమవారం పాదరక్షలు లేకుండానే భార్య హరిప్రియతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా గత నెల 15న అనిల్‌జాదవ్ ఆయన సతీమణి హరిప్రియ ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రోత్సవాలు ముగిసినప్పటికి నెల రోజులుగా ఆయన పాదరక్షలు లేకుండానే ప్రచారం చేస్తున్నారు. సోమవారం బోథ్‌లో నామినేషన్ వేయడానికి భార్యభర్తలు పాదరక్షలు లేకుండానే ఆర్వో కార్యాలయం వరకు నడుచుకుంటూ వస్తున్నారు. అక్కడ ఉన్న వారు ఆసక్తిగా గమనించారు.

అలజడి నుంచి ప్రశాంతత వైపు

- పెరిగిన పోలీసుల నిఘా.. నిత్యం తనిఖీలు
- మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నతాధికారుల పర్యటనలు
- సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక బలగాలు

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు
మొత్తం 801
సాధారణం 635
సమస్యాత్మకం 113
అంత్యంత సమస్యాత్మకం 53



చెన్నూర్‌లో పోలీసు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

చెన్నూర్: నాడు అలజడి మధ్య ఎన్నికల జరుగగా, నేడు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఒకప్పుడు చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో మవోయిస్టుల అలజడి ఎక్కువగా ఉండేది. ఆ రోజుల్లో ఈ రెండు నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణ అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారింది. ఎన్నికలు ముగిసే వరకు అధికార యంత్రాంగం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహించిన రోజులవి. 1994 నుంచి 2009 వరకు జరిగిన ఎన్నికల సమయంలో మావోయిస్టుల ప్రభావం కనిపించింది. నేటికీ జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలు మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలుగా పేరుంది.

తగ్గిన ప్రభావం

చెన్నూర్ నియోజకవర్గం కోటపల్లి, బెల్లంపల్లి నియోజకవర్గం వేమనపల్లి మండలాలు అటవీ ప్రాంతాలు కావడంతోపాటు గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల సౌకర్యం లేదు. సమాచార వ్యవస్థ సైతం అందుబాటులో లేకపోవడంతో ఈ రెండు నియోజకవర్గాల్లో మావోయిస్టుల ఆధిపత్యం కొనసాగింది. నేడు గ్రామాలకు రవాణా, సమాచార వ్యవస్థ అభివృద్ధి చెందింది. పోలీసుల నిఘాతోపాటు పటిష్టమైన సమాచార వ్యవస్థ మెరుగైంది. గ్రామీణ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే క్షణాల్లో పోలీసులకు సమాచారం అందుతోంది. దీంతోపాటు మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో నిత్యం పోలీసుల పర్యటనలు, వివిధ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో మావోయిస్టుల ప్రభావం తగ్గుముఖం పట్టింది. దీంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయి.

నాటి ఘటనలు

- 1999లో జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రచారం జోరుగా సాగింది.
- ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కోటపల్లి మండలం కొండంపేట గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు పోటు సత్యనారాయణరెడ్డిని చెన్నూర్ దళం బంధించి ఎన్నికల ప్రచారంలో పాల్గొనని ప్రమాణం చేయించి ముక్కు నెలకు రాయించారు.
- గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేయద్దని మవోయిస్టులు అల్టిమేటం జారీ చేశారు.
- కోటపల్లి మండలంలోని మల్లంపేటలో ఫారెస్ట్ కలప డిపోను మావోయిస్టులు దహనం చేయగా సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లింది.
- కోటపల్లి మండలం సిర్సా గ్రామంలో 1999 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లు తీసుకొని వస్తున్న ట్రాక్టర్‌ను ఎదుల్లబంధం వద్ద మావోయిస్టులు దహనం చేశారు. సిర్సాలో ఉప ఎన్నికలు జరిగాయి.

బీఫాం అందుకున్న వెడ్మ బొజ్జు



బీఫాంతో వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్ గాంధీభవన్‌లో ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం బీఫాం అందుకున్నారు. అదేవిధంగా ఈనెల 8న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం ఉట్నూర్‌కు వస్తుండగా పార్టీ నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. స్థానిక బస్‌డిపో గ్రౌండ్‌లో మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగసభ ఉంటుందని పేర్కొంటున్నారు. అదేరోజు అభ్యర్థి వెడ్మ బొజ్జు నామినేషన్ వేయనున్నారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో పోలీసులు



పట్టుకున్న మద్యంతో పోలీసులు

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ శివారు ప్రాంతంలో పక్కా సమాచారంతో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని సోమవారం పట్టుకున్నామని ఎస్సై సాయికుమార్ తెలిపారు. వీటి విలువ రూ.4956లు ఉంటుందన్నారు. అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న బరుకుంట భోజన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ సోమవారం ఓ హోటల్‌లో మద్యం అమ్ముతున్నారని సమాచారంతో దాడి చేసి వాటిని సీజ్ చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. 6.480 లీటర్ల మద్యం విలువ రూ.7,128 ఉంటుందన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బెల్టుషాపుపై దాడి

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపుపై సోమవారం దాడిచేసి మద్యాన్ని పట్టుకున్నామని ఎస్సై లింబాద్రి తెలిపారు. రూ.22,315 విలువైన 45 లీటర్ల మద్యాన్ని పట్టుకుని సీజ్‌చేయడంతోపాటు ఒకరిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బోథ్‌లో మధ్య వయస్సు ఓటర్లే అధికం

- తగ్గిన వృద్ధుల ఓట్లు

ఇచ్చోడ: బోథ్ అసెంబ్లీ నియోజకవర్గం ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానం కాగా, ప్రధాన పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్నారు. నువ్వా నేనా అనే రీతిలో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మొత్తంగా చూస్తే ఈ నియోజకవర్గంలో ఓటర్లు అధికంగా మధ్య వయస్సు ఉన్నవారే ఉన్నారు. వృద్ధుల ఓటర్లు చాలా తగ్గాయి. 30 నుంచి 39 ఏళ్ల వయస్సు ఉన్న వారు 62,120 ఓటర్లు ఉండగా, 80 ఏళ్లకు పైగా వయస్సు ఉన్నవారు కేవలం 2,316 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికలో మధ్యవయస్సు ఉన్నవారే కీలకంగా ఉన్నారు.

నియోజకవర్గంలో వయస్సు గల ఓటర్ల వివరాలు

మండలం	18-19	20-29	30-39	40-49	50-59	60-69	70-79	80 పైబడిన
భీంపూర్	554	4,371	5,713	3,272	2,441	1,568	714	213
తాంసి	372	2,176	4,023	2,417	1,938	1,254	544	166
తలమడుగు	828	5,722	8,305	4,799	3,590	2,296	1,010	309
గుడిహత్నూర్	878	5,774	7,552	4,356	2,882	1,664	285	254
ఇచ్చోడ	1,277	8,373	10,122	6,174	4,099	2,301	1,062	344
సిరికొండ	321	1,944	1,913	1,192	791	471	207	54
బజార్‌హత్నూర్	796	5,673	6,779	3,927	2,767	1,864	920	356
బోథ్	1,405	8,551	10,773	6,616	4,825	2,919	1,298	370
నేరడిగొండ	897	5,054	6,940	3,912	2,976	1,591	686	250
మొత్తం	7,328	48,978	62,120	36,665	26,129	15,928	7,226	2,316

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. కాలనీలో పెట్రోలింగ్‌కు వెళ్లిన సమయంలో హన్వడే భాస్కర్ తన కిరాణ షాప్‌లో మద్యం విక్రయిస్తున్నాడు. ఆయన వద్ద నుంచి 180 మి.లీ 5 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి అంత్యక్రియలు



అంత్యక్రియలు చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో నిరుపేద అయిన పన్నెల మల్లయ్య (65) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ సిబ్బందితో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయించారు. వైకుంఠరథంలో మృతదేహాన్ని స్థానిక గోదావరికి తీసుకెళ్లారు. భార్య రాజేశ్వరి, కుమారుడు సాయి సమక్షంలో అంత్యక్రియలు చేపట్టారు. ఎస్సై లింబాద్రి, మున్సిపల్ సిబ్బంది మానాల శంకర్, రాకేశ్ తదితరులున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆపరేటర్ మృతి



నేరపాది మృతదేహం

భైంసా: బాసర మండలం కిర్గుల్(కె) గ్రామంలో వరికోత మిషన్ ఆపరేటర్ విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..కర్ణాటకకు చెందిన నేరపాది(23) వరికోతల కోసం ముథోల్ ప్రాంతానికి వచ్చాడు. సోమవారం వరికోత కోసం బాసర మండలం కిర్గుల్(కె) గ్రామానికి వెళ్తుండగా రోడ్డుకు ఆనుకుని ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు తగలి షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితికిచేరుకున్న అతన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 90 శాతం గాయాలతో ఉన్న నేరపాది మృతిచెందాడు.

రూ.65 లక్షల అల్ప్రాజోలం పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

కామారెడ్డిక్రైం: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో సోమవారం ఉదయం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరున్నర కిలోల అల్ప్రాజోలం పట్టుకుని ఇద్దరిని రిమాండ్ చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథం తెలిపారు. కామారెడ్డి ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. సిద్దిపేట పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన అంబరి రమేష్ గౌడ్ 6.30 కిలోల అల్ప్రాజోలం తీసుకొని సోమవారం కామారెడ్డి కొత్త బస్టాండ్‌లో నిర్మల్ ఏరియాకు చెందిన వ్యక్తి కోసం ఎదురుచూస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. గతంలో అంబరి రమేష్‌గౌడ్ ఓ ల్యాబ్‌లో సూపర్‌వైజర్‌గా పని చేసేవాడని తెలిపా రు. ఆ అనుభవంతో అల్ప్రాజోలం తయారు చేసి ఇతర ప్రాంతాలకు తరలించేవాడు. అందులో భా గంగా సోమవారం నిర్మల్‌కు చెందిన లింగేశ్‌ను ర ప్పించి, ఆ ఏరియాకు తరలించేందుకు సిద్ధమవుతుండగా అధికారులు పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.65 లక్షల వరకు ఉంటుందన్నారు. వీ టితోపాటు రెండు బైకులను సీజ్ చేశామని తెలిపా రు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్, కామారెడ్డి ఎక్సైజ్ సీఐ విజయకుమార్ పాల్గొన్నారు.

ఇనామ్ భూములు పరిశీలన



భూముల పత్రాలు పరిశీలిస్తున్న సద్దాం

బేల: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 45, 46లోని మొత్తం 16 ఎకరాల 13 గుంటల మసీదు ఇనామ్ భూములను జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సద్దాం సోమవారం పరిశీలించారు. ఇనామ్ భూమిని నవాబుద్దీన్ ఖాజీ అమ్ముకోవడంతో హైకోర్టులో కేసు కొనసాగుతోంది. ఆ భూమిలో వ్యవసాయ సాగు చేస్తుండడం, మసీదులో సేవలు పట్టించుకోకపోవడం, తదితర అంశాలపై ఆరా తీశారు. సద్దాం మాట్లాడుతూ పూర్తిస్థాయి రికార్డులు పరిశీలించాకే త్వరలో వివరాలు వెల్లడిస్తామన్నారు. వక్ఫ్ బోర్డు జూనియర్ అసిస్టెంట్ అశ్ఫక్ ఉన్నారు.

దండారీ ఉత్సవాలు షురూ



కేస్లాపూర్‌లో పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: ఆదివాసీ గూడేల్లో దండారీ సందడి మొదలైంది. మండలంలోని సమాక, కేస్లాపూర్, వాల్గొండ గ్రామాల్లో సోమవారం భోగి(యేత్మసుర్) పూజలు నిర్వహించి ఉత్సవాలు ప్రారంభించారు. గిరి గ్రామాల్లో వారం పాటు గుస్సాడి, కోలాటం నృత్యాల సందడి కనిపించనుంది. ఇతర గ్రామాల దండారీ బృందాలను తమ గ్రామానికి అతిథులుగా ఆహ్వానిస్తామని, తాము ఇతర గ్రామాలకు అతిథులుగా వెళ్తామని ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు. దీపావళి తరువాత కోలబోడి పూజలతో ఉత్సవాలు ముగిస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు పెందోర్ భగవంత్ రావ్, మెస్రం వెంకట్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, యశ్వంత్‌రావ్ తదితరులున్నారు.